క్లుప్తంగా

ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

కొత్తపల్లి: ప్రజలంతా శాంతియుత వాతావరణంలో స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎన్నికల ఇన్‌చార్జ్ ఎస్పీ రజని అన్నారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన అమీనాబాద్, ఉప్పాడల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను ఆదివారం రాత్రి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. అంతేకాకుండా కేంద్రాల పరిధిలోనూ నిఘా పెట్టామన్నారు. ప్రజలు పోలింగ్ సమయంలో గుంపులు గుంపులుగా ఉండరాదన్నారు. పోలింగ్ సమయంలో అభ్యర్థులు ఓటర్లను వాహనాలపై తరలించడం, తమకు ఓటు వేయాలని కోరడం చేయరాదన్నారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం

నేడు జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కాకినాడ ఎంపీడీఓ వెంకటనారాయణ అన్నారు. మండలంలోని కొత్తపల్లి, వాకతిప్పల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యంతో పాటు పలు సమస్యాత్మక కేంద్రాల వద్ద బారికేడ్లను ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో 70 పోలింగ్ కేంద్రాలో ఎన్నికలు జరుగుతున్నాయన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట ఏర్పాట్లు



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కాకినాడ పార్లమెంట్ అబ్జర్వర్ గణేష్

గొల్లప్రోలు: పట్టణంలో బాలుర హైస్కూల్‌లో ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాలను కాకినాడ పార్లమెంట్ అబ్జర్వర్ గణేష్ ఆదివారం పరిశీలించారు.ఆయన వెంట హౌసింగ్ పీడీ సత్యనారాయణ ఉన్నారు. మండలంలోని గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను ట్రైనీ డీఎస్పీ ప్రమోద్ పరిశీలించి బందోబస్తు ఏర్పాట్ల పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఘనంగా శంకర జయంతి



పంచారామ క్షేత్రంలో పూజలు చేస్తున్న పండితులు

సామర్లకోట: దేవదాయశాఖ ఆదేశాల మేరకు ఆదివారం శంకర జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామ భీమేశ్వరస్వామి ఆలయంలో నంది మండపం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై జయంతి వేడుకలు నిర్వహించారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వర శర్మ, చెరుకూరి రాంబాబు, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు వినయ్‌ల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులకు పండ్లు ప్రసాదంగా అందజేశారు.

వైభవంగా డెక్కలపోలమ్మ జాతర

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు గ్రామ దేవత డెక్కలపోలమ్మ అమ్మవారి జాతర ఆదివారం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుడు రమేష్ ఆధ్వర్యంలో పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం



చోడిపల్లిపేటలో శ్రీనుకు ఆర్థిక సహాయం అందిస్తున్న స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం పంచాయతీ చోడిపల్లిపేట గ్రామానికి చెందిన కిడ్నీ బాధితుడు వెలుగు శ్రీనుకు స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు ఆదివారం ఆర్థిక సహాయం అందజేశారు. శ్రీను రెండు కిడ్నీలు చెడిపోవడంతో కొద్ది రోజులుగా ఇంటికే పరిమితమయ్యాడు. భార్య, నలుగురు పిల్లలతో కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతోంది. విషయం తెలుసుకున్న స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నేమాల శ్రీనివాసరావు, ఇతర సభ్యులు కలిసి ఆదివారం రూ.10 వేలు బాధితుడు శ్రీనుకు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు వెంకట్, శ్రీను, గోవిందు, వీరబాబు, శ్రీనుబాబు, నాగబాబు, డాన్, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.



సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్డీవో రామారావు



పోలింగ్ విధులకు బయలుదేరుతున్న ఎన్నికల సిబ్బంది



ఎన్నికల సామగ్రిని సరిచూసుకుంటున్న పీఓలు, ఏపీఓలు



బస్సెక్కి పోదామంటూ తరలివెళుతున్న సిబ్బంది

ఎన్నికలకు సర్వం సిద్ధం

- 201 పోలింగ్ బూత్‌లు..
- 2,15,095 మంది ఓటర్లు
- ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని పిలుపు ఇచ్చిన ఈఆర్వో రామారావు



పెద్దాపురం ఎంఆర్ కళాశాల నుంచి పోలింగ్ సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది

పెద్దాపురం/సామర్లకోట: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 13వ తేదీ నిర్వహించే సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నియోజకవర్గంలోని 201 పోలింగ్ బూత్‌లలో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని నియోజకవర్గ ఈఆర్వో, ఆర్డీవో జె.సీతారామారావు తెలిపారు. సుమారు 1392 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా ఆదివారం స్థానిక మహారాణి కళాశాలలో పోలింగ్ సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో జేఎస్ రామారావు మాట్లాడుతూ విధిగా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎటువంటి అంవాఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టామని, ఎన్నికల సిబ్బంది తమ విధులను సమర్థవంతంగా నిర్వహించి ఎన్నికలను సజావుగా నిర్వహించాలన్నారు. పోలింగ్ ప్రక్రియకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, నియోజకవర్గానికి చెందిన ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు. సెగ్మెంట్ పరిధిలో సుమారు మంది పురుషులు 1,05,788 మంది, మహిళలు 1,09,294 మంది ఇతరులు 13 వెరసి సుమారు 2,15,,095 మంది ఓటర్లు ఉన్నారన్నారు. 201 పోలింగ్ బూత్‌లలో ఆయా ఓటర్లు విధిగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటలలోపు ఓటు హక్కు వినియోగించుకోవచ్చని, పోలింగ్ కేంద్రానికి 200 మీటర్లు బారికేడ్లు ఏర్పాటు చేశామని, ఓటరు మినహా మిగిలిన వారెవరికి పోలింగ్ కేంద్రం 200 మీటర్ల లోపు ప్రవేశం ఉండదన్నారు. నియోజకవర్గంలో సుమారు 46 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు కల్పించడం జరుగుతుందన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించామని, విభిన్న ప్రతిభావంతులకు వీల్‌చైర్లు కూడా ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ ప్రక్రియలో 22 మంది సెక్టార్ అధికారులు, 29 మంది మైక్రో అబ్జర్వర్ల పర్యవేక్షణ ఉంటుందని జేఎస్ రామారావు తెలిపారు. డీఎస్పీ లతాకుమారి మాట్లాడుతూ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం సిబ్బంది సుమారు 22 రూట్ల ద్వారా 50 వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు.

ఓటు వేయడానికి స్వస్థలాలకు..

సామర్లకోట: వివిధ ప్రాంతాలల్లో ఉపాధి కోసం వెళ్లిన జనం తమ సొంత ప్రాంతాల్లో ఓటు హక్కును వినియోగించుకొవడానికి స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. దీనిలో భాగంగా ఆదివారం ఉదయం నుంచి రైల్వే స్టేషన్, బస్సు కాంప్లెక్స్ ప్రయాణికుల రద్దీతో కిటకిట లాడాయి. హైదరాబాద్, విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం ప్రాంతాల నుంచి సామర్లకోట రైల్వే స్టేషన్‌లో దిగిన ప్రయాణికులు తమ స్వగ్రామాలకు వెళ్లేందుకు బస్సు కాంప్లెక్స్‌కు చేరుకున్నారు. దాంతో బస్సు కాంప్లెక్స్ ప్రయాణికులతో నిండిపోయింది. భారీ సంఖ్యలో బస్సులను ఎన్నికల ప్రక్రియకు కేటాయించడంతో పలుచోట్ల ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. భారీ సంఖ్యలో ప్రయాణికులు రావడంతో నిత్యం రద్దీగా ఉండే రైల్వేస్టేషన్ సెంటర్‌లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అవుట్‌పోస్టు పోలీసు స్టేషన్ ఏర్పాటు చేశారు.



ప్రయాణికులతో నిండిన సామర్లకోట బస్సు కాంప్లెక్స్

సామగ్రితో బూత్‌లకు చేరుకున్న పోలింగ్ సిబ్బంది

నియోజకవర్గ పరిధిలోని సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సామగ్రిని సంబంధిత సిబ్బందికి అధికారులు పంపిణీ చేశారు.

మొత్తం 201 పోలింగ్ కేంద్రాలకు అవసరమైన సామగ్రిని పెద్దాపురం మహారాణి కళాశాల ఆవరణలో ఆదివారం సిబ్బందికి అందజేశారు. ఈఆర్వో జె సీతారామారావు ఆధ్వర్యంలో సిబ్బంది వాటిని పరిశీలించుకునే అవకాశం కల్పించారు.

సార్వత్రిక పోరుకు సన్నద్ధం

పిఠాపురం: నేడు జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు అధికారిక యంత్రాంగం ఏర్పాట్లన్నీ పూర్తి చేసింది. పిఠాపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో అధికారులు పోలింగ్ సామగ్రిని ఎన్నికల సిబ్బందికి అందజేశారు. ఎన్నికల నిర్వహణలో పీఓలు 309 మంది, ఏపీఓలు 314 మంది, ఓపీఓలు 1188 మంది పనిచేయనున్నట్లుగా జేసీ, పిఠాపురం నియోజకవర్గ ఆర్ఓ రామ్‌సుందర్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం పోలింగ్ ఏర్పాట్లపై చేపట్టిన చర్యలను 'సాక్షి'కి వివరించారు. పిఠాపురం నియోజకవర్గంలో 242 పోలింగ్‌బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. 22 రూట్‌లు, 138 లొకేషన్స్, 22 సెక్టార్లుగా విభజించామన్నారు. 22 మంది సెక్టార్ అధికారులను నియమించామని ఒక్కో పోలింగ్ కేంద్రంలోను ఒక పీఓ, ఒక ఏపీఓ, నలుగురు ఓపీఓలు కలిసి ఆరుగురు బాధ్యతలు నిర్వహిస్తారన్నారు. పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ జరుగుతుందన్నారు. వీరితో పాటు ఇతర సిబ్బంది ఉంటారన్నారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో ఓటర్లు తప్ప ఇతరులు ఉండటానికి వీల్లేదన్నారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి అభ్యర్థి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం, సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం అందరు అభ్యర్థులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలు లేకుండా ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకోవాలని సూచించారు. ఎవరైనా ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని కచ్చితంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 71 అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించామని, వాటి దగ్గర పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

పిఠాపురం ఓటర్లు 2,36,409

పిఠాపురం నియోజకవర్గంలో 2,36,409 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వారిలో పురుషులు 1,18,183 మంది, స్త్రీలు 1,18,223 మంది, హిజ్రాలు ముగ్గురు ఉన్నట్లు ఎన్నికల అధికారి రాంసుందరరెడ్డి తెలిపారు. గొల్లప్రోలు రూరల్‌లో 44,319 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 22,554 మంది, స్త్రీలు 21,763 మంది, హిజ్రాలు ఇద్దరు ఉన్నారు. గొల్లప్రోలు నగర పంచాయతీలో 20,617 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 10,297 మంది, స్త్రీలు 10,320 మంది ఉన్నారు. పిఠాపురం రూరల్‌లో 62,093 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 31,468 మంది, స్త్రీలు 30,625 మంది ఉన్నారు. పిఠాపురం పట్టణంలో 42,829 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 20,669 మంది, స్త్రీలు 22,159 మంది, హిజ్రా ఒకరు ఉన్నారు. కొత్తపల్లి మండలంలో 66,551 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 33,195 మంది, స్త్రీలు 33,356 మంది ఉన్నారని ఆయన తెలిపారు.



పిఠాపురంలో పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రంలో అధికారులు





పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రి తీసుకెళుతున్న సిబ్బంది



పోలింగ్‌కు సిద్ధమైన ఈవీఎంలు

ఆకట్టుకుంటున్న పోలింగ్ కేంద్రాలు



పిఠాపురంలో ఏర్పాటుచేసిన పింక్ పోలింగ్ స్టేషన్



పిఠాపురంలో ఓబీఎస్ పాఠశాలలో ఆదర్శ పోలింగ్ స్టేషన్

పిఠాపురం: బెలూన్లతో అందంగా అలంకరించిన స్వాగత ద్వారం.. గులాబీ రంగుతో కళకళలాడుతున్న ముఖ ద్వారం.. ఎంతో ఆకర్షణీయంగా ఓటర్లను ఆకర్షించడానికి పోలింగ్ కేంద్రాల్లో చేసిన ఏర్పాట్లు ఇవి. ఈ పోలింగ్ కేంద్రాలను పిఠాపురం నియోజకవర్గంలో ఏర్పాటు చేశారు. పిఠాపురం రదాలపేట బాప్టిస్ట్ చర్చి దగ్గర ప్రైమరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన 157 నంబరు పోలింగ్ స్టేషన్‌ను మహిళలు ఎక్కువగా ఉన్నందున వారికి ఇష్టమైన గులాబీ రంగుతో అందంగా అలంకరించారు. దీనికి పింక్ పోలింగ్ స్టేషన్‌గా నామకరణం చేశారు. పిఠాపురం ఓబీఎస్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన 155 నంబరు పోలింగ్ స్టేషన్‌ను రంగురంగుల బెలూన్లతో అందంగా అలంకరించారు. దీనికి ఆదర్శ పోలింగ్ స్టేషన్‌గా నామకరణం చేశారు. ఇక్కడ ఓటర్లను ఆకర్షించేలా చూడ ముచ్చటగా ఏర్పాటు చేసిన అలంకరణ అందరినీ ఆకట్టుకుంటుంది. కొత్తపల్లి మండలం ఉప్పాడలో ఎక్కువ మంది దివ్యాంగులు ఉండడంతో 182 నంబరు పోలింగ్ స్టేషన్లో అన్ని సౌకర్యాలతో దివ్యాంగులు సునాయాసంగా ఎటువంటి ఇబ్బంది లేకుండా వెళ్లి ఓటు హక్కు వినియోగించుకునేలా పోలింగ్ స్టేషన్‌ను తీర్చిదిద్దారు.

నూకాలమ్మ తల్లి దర్శనానికి పోటెత్తిన భక్తులు



నూకాలమ్మ అమ్మవారు



అమ్మవారి దర్శనానికి వేచి ఉన్న భక్తజనం

పెద్దాపురం: మండలంలోని కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు బారులు తీరారు. కొత్త అమావాస్యను పురస్కరించుకుని సుమారు 45 రోజుల పాటు నిర్వహించే జాతరలో భాగంగా ఆలయ కమిటీ చైర్మన్ గవరసాని వీరాస్వామి, ఆలయ ఈఓ తలాటం వెంకట సూర్యనారాయణల ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలతో తరలిరావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. సీఐ రవికుమార్ పర్యవేక్షణలో ఎస్‌ఐ వెలుగుల సురేష్ ఎటువంటి పోలీస్ బందోబస్తు కల్పించారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో యాత్రికులకు మజ్జిగ, పాలు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మరిడమ్మతల్లి ఆలయం ఆధ్వర్యంలో చలివేంద్రం

పెద్దాపురం: మరిడమ్మ అమ్మవారి ఆలయ సిబ్బంది సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈఓ సీహెచ్‌వి రామ్మోహనరావు అన్నారు. వేసవి ఎద్దడి నేపథ్యంలో ఆదివారం ఆలయం వద్ద దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. పుర ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అకాల వర్షంతో అవస్థలు



ప్రత్తిపాడు డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో అకాల వర్షానికి నేలకూలిన టెంట్

ప్రత్తిపాడు: అకాల వర్షంతో పోలింగ్ సిబ్బంది అవస్థలు పడ్డారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది తీసుకున్న చర్యలతో వర్షం నుంచి ఎన్నికల సిబ్బందికి కొంతమేర ఇబ్బందులు తప్పాయి. ప్రత్తిపాడు మినర్వా విద్యా సంస్థల ప్రాంగణంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు త్వరిగతగిన పోలింగ్ సామగ్రిని పోలింగ్ అధికారులకు అప్పగించారు. ఆదివారం సాయంత్రం సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లే సమయంలో అకస్మాత్తుగా ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. బస్సుల్లో సామగ్రిని తరలిస్తుండగా వర్షం కురవడంతో పోలింగ్ సిబ్బంది తమ సామగ్రితో తిరిగి మినర్వా ప్రాంగణంలోకి పరుగులు తీశారు. గాలులకు మినర్వా ప్రాంగణం బయట, లోపల వేసిన టెంట్‌లు నేలకూలాయి. ఆ సమయానికి టెంట్‌లలో సిబ్బంది లేకపోవడంతో ఎటువంటి నష్టం జరగలేదు. ఓటింగ్ యంత్రాలు, సిబ్బంది వర్షంలో తడిసిపోకుండా ఎన్నికల అధికారులు తక్షణ చర్యలు చేపట్టారు. వర్షం తగ్గిన వెంటనే సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు.

ప్రత్తిపాడు రూరల్: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత, ఉక్కబోత ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఓ మోస్తరు వర్షం కురిసింది. అప్పటి వరకు ఎండ తీవ్రతకు అల్లాడిపోయిన జనం వాతావరణం చల్లబడటంతో ఉపశమనం పొందారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది.

సిరాపై వదంతుల్ని నమ్మొద్దు

పిఠాపురం నియోజకవర్గ ఆర్ఓ రామ్‌సుందర్‌రెడ్డి

పిఠాపురం: ఓటు హక్కు వినియోగించుకునే ఓటర్లకు వేసే చెరగని సిరా ఇతరులకు అందుబాటులో ఉందంటూ సోషల్ మీడియాలో వస్తున్నవన్నీ వదంతులేనని, వాటిని నమ్మొద్దని జేసీ, పిఠాపురం నియోజకవర్గ ఆర్ఓ రామ్‌సుందర్‌రెడ్డి తెలిపారు. ఆయన పిఠాపురంలో విలేకర్లతో మాట్లాడుతూ చెరగని సిరా ద్వారా ఓటర్ల వేళ్లపై మార్కు చేస్తూ ఓటు హక్కును వారు వినియోగించుకోకుండా చూడాలనే కుట్ర జరుగుతోందని సోషల్ మీడియాలో వస్తున్న దుష్ప్రచారాన్ని ఆయన ఖండించారు. చెరగని సిరా ప్రభుత్వం మాత్రమే తయారు చేస్తుందని, ఈ సిరా భారత ఎన్నికల సంఘం వద్ద మాత్రమే ఉంటుందన్నారు. ఇతరులెవరి వద్ద అందుబాటులో ఉండదన్నారు. ఇతరుల దగ్గర ఈ సిరా అందుబాటులో ఉందని చేస్తున్న ప్రచారాల్లో ఎటువంటి నిజం లేదన్నారు. ఎవరైనా ఇతర సిరాను ఉపయోగించి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఒక వేళ ఎవరైనా అటువంటి చర్యలకు పాల్పడితే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

మండలంలో 15 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు

గోకవరం: మండలవ్యాప్తంగా సోమవారం జరిగే ఎన్నికల పోలింగ్‌కు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో 64 పోలింగ్ బూత్‌లు ఉండగా వీటిలో 15 సమస్యాత్మక పోలింగ్ బూత్‌లను అధికారులు గుర్తించారు. కృష్ణునిపాలెంలో ఐదు, మల్లవరంలో ఆరు, తిరుమలాయపాలెంలో నాలుగు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నట్టు తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఒక్కో పోలింగ్ బూత్ వద్ద ఓటర్లకు ఇబ్బందులు లేకుండా బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని టెంట్లు వేశారు. అలాగే 32 బూత్‌ల వద్ద వీల్‌చైర్ సౌకర్యం కల్పించారు. ఒక్కో బూత్ వద్ద ఆరుగురు సిబ్బంది విధులు నిర్వహించనుండగా వారి కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి ఆయా బూత్‌ల వద్దకు సిబ్బంది పోలింగ్ సామగ్రితో చేరుకున్నారు. ఆయా బూత్‌ల వద్ద పోలీసు సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు.

తునికి చేరిన శివకరణ్‌సింగ్ పాదయాత్ర



తునిలో శివకరణ్‌సింగ్‌కు స్వాగతం పలుకుతున్న ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు

తుని: కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ పాదరక్షలు లేకుండా ఉత్తరప్రదేశ్‌కు చెందిన శివకరణ్‌సింగ్ చేస్తున్న పాదయాత్ర ఆదివారం తునికి చేరింది. శివకరణ్‌సింగ్ పాదయాత్రకు ఆదివారం స్థానిక ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శివకరణ్‌సింగ్ మాట్లాడుతూ సనాతన సంస్కృతి అభివృద్ధే ధ్యేయంగా 2022 మార్చి 25న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం పతేపూర్ జిల్లా ఖరౌలీ గ్రామం నుంచి ప్రాదయాత్ర ప్రారంభించానన్నారు. ఇప్పటి వరకూ 13 వేల కిలోమీటర్ల పాదయాత్ర చేశానని, ఈ యాత్ర కన్యాకుమారి వరకూ కొనసాగుతుందని చెప్పారు. గో సంపద సంరక్షణ, మత్తు పదార్థాలకు యువతను దూరంగా ఉంచి దేశభక్తిని పెంపొందించడం, అమరవీరులకు నివాళిగా మొక్కలు పెంచడం, భారతీయులంతా సుఖసంతోషాలతో అభివృద్ధి పథంలో నడవాలన్నదే తన జీవిత ఆశయమని తెలిపారు. కార్యక్రమంలో కందుల వినోద్, కుందెం సత్యనారాయణ, చదరం నరిసింగరావు, ములగాల ఉదయ్‌కుమార్, పర్వత బాబూరావు, రాపర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.